

నెన్నెలలో...


తీగల్‌పహాడ్‌లో..


భీమారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



బెల్లంపల్లిలో...


దండేపల్లిలో...

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

భీమారం/కాసిపేట/బెల్లంపల్లి/నెన్నెల/దండేపల్లి/నస్పూర్: పాఠశాలల్లో వీడ్కోలు వేడుకలు, వార్షికోత్సవ కార్యక్రమాలు మంగళవారం ఉల్లాసంగా ఉత్సాహంగా సాగాయి. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. భీమారం జెడ్పీ ఉన్నత పాఠశాల, దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, తీగల్‌పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వార్షికోత్సవం నిర్వహించగా, కాసిపేట మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, దేవాపూర్, మల్కేపల్లి ఉన్నత పాఠశాలల్లో, బెల్లంపల్లి బజారు ఏరియా జిల్లా పరిషత్ (బ్రాంచ్) హైస్కూల్‌లో, నెన్నెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీడ్కోలు సమావేశాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'పది' విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు వీడ్కోలు పలకగా వీడలేమంటూ, వీడిపోమంటూ విద్యార్థినులు భావోద్వేగాలకు గురయ్యారు. విద్యార్థులు గొప్పగా చదువుకొని ఉన్నత స్థానానికి చేరి సమాజానికి మేలు చేయాలని, విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని పలువురు వక్తలు సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

క్లుప్తంగా

రోడ్లపై పేడ తొలగింపు



సాక్షి స్పందన

భీమారం: మండలంలోని నర్సింగాపూర్‌లో సీసీ రోడ్డుపై ఎడ్లబండ్లతో పాటు పశువుల పేడ వేస్తుండడంతో 'పారిశుద్ధ్యంపై పట్టింపు కరువు' అనే శీర్షికన కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. పంచాయతీ అధికారులు మంగళవారం ట్రాక్టర్ ద్వారా పేడను తరలించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

చెన్నూర్‌రూరల్: మండలంలోని శివలింగాపూర్ గ్రామంలో మంగళవారం 25కేవీ నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. వేసవిలో ఓవర్ లోడ్‌ను అధిగమించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ బాలకృష్ణ, ఏఈ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పెద్దింటి రాజన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ పెన్షనర్లకు ఉపశమనం కల్పించాలి

మంచిర్యాలటౌన్: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఈపీఎఫ్ పెన్షనర్లకు ఎలాంటి ఉపశమనం లభించలేదని, కేంద్రం ఆ దిశగా చర్యలు తీసుకునేలా చూడాలని భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు లగిశెట్టి కమలాకర్, ప్రధాన కార్యదర్శి రాజు యాదవ్ కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, వ్యవసాయ కార్మికులు, మైనింగ్, అసంఘటిత కార్మికులు నిర్లక్ష్యానికి గురయ్యారని పేర్కొన్నారు.

అబాది భూముల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతివ్వాలి

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలో 80శాతం అబాది భూములు ఉన్నాయని, ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలని మాజీ కౌన్సిలర్ గర్రెపల్లి శాంతరాణి, గర్రెపల్లి నర్సయ్య దంపతులు కలెక్టర్‌ను కోరారు. మున్సిపాలిటీ చుట్టూ తిరిగిన ఏరియా సర్టిఫికెట్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

మహాసభలు జయప్రదం చేయండి

పాతమంచిర్యాల: జిల్లాలోని మందమర్రి సీఈఆర్ క్లబ్‌లో ఏప్రిల్ 13న నిర్వహించ తలపెట్టిన టీఎస్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ (అనుబంధం) జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని దాగం మల్లేష్, జాడి పోషం అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. రవి కుమార్, తిరుపతి, రాజేష్, సత్తయ్య, రాయమల్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఏక్‌భారత్-శ్రేష్ఠ్ భారత్


వివిధ వేషధారణల్లో విద్యార్థులు

దండేపల్లి: మండలంలోని పెద్దపేట, గుడిరేవు ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం ఏక్‌భారత్-శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల వివిధ వేషాధారణలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ద్వారక స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం చిన నర్సయ్య మాట్లాడారు. సీఆర్పీ సురేందర్, పాఠశాలల హెచ్‌ఎంలు శ్రీలత, బుచ్చన్న పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పాతమంచిర్యాల: జిల్లాలోని నస్పూర్‌లో ఈ నెల 23న నిర్వహించే భగత్‌సింగ్, రాజ్‌గురుల వర్ధంతిని విజయవంతం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి లింగం రవి అన్నారు. సీపీఐ కార్యాలయంలో మంగళవారం వర్ధంతి పోస్టర్ ఆవిష్కరించారు.

మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి


వయోజనులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

కాసిపేట: పట్టుదలతో అందరికి చదువు నేర్పించి, అక్షర దానం చేసి మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో చదువు నేర్చుకుంటున్న వయోజనులకు మంగళవారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశానుసారం కాసిపేట మండలాన్ని వంద రోజుల్లో వంద శాతం అక్షరాస్యత సాధించేందుకు ఎంపిక చేసి 22 గ్రామపంచాయతీల్లో వందశాతం లక్ష్యంగా పనిచేయనున్నట్లు తెలిపారు. అధికారులతో పాటు వలంటీర్లు పూర్తి స్థాయిలో కృషి చేసి లక్ష్యం సాధించాలన్నారు. కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని, మహిళలు టైలరింగ్ శిక్షణతో పాటు అక్షరాలు నేర్చుకోవడంలో ముందుంటున్నారని ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో వయోజన విద్య పీడీ పురుషోత్తంనాయక్, ఎంపీడీవో సత్యనారాయణసింగ్, తహసీల్దార్ భోజన్న, ఎంపీవో షేక్ సబ్దర్ అలీ, ఏపీఎం వెంకటేష్, వయోజన విద్య కో ఆర్డినేటర్ శాంకరీ, జనార్దన్ ఉన్నారు.

విద్యార్థులు పరీక్షల్లో ఒత్తిడికి గురికావొద్దు


అవగాహన కల్పిస్తున్న సీఐ అఫ్జలొద్దీన్

నెన్నెల: విద్యార్థులు పరీక్షల్లో మానసిక ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దీన్ అన్నారు. చిత్తాపూర్ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు మంగళవారం పదో తరగతి పరీక్షలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు వెళ్తే ప్రగతి సాధిస్తారన్నారు. విద్యపైనే దృష్టి కేంద్రీకరించాలని వివరించారు. ఈ నెల 21న పదో తరగతి వార్షిక పరీక్షలు ఉన్న నేపథ్యంలో ప్రణాళికబద్ధంగా చదవాలని, సకాలంలో నిద్రపోవాలని విద్యార్థినులకు సూచించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలంటే ఒత్తిడిని జయించాలన్నారు. పరీక్షల్లో విజయం సాధించడంపై విద్యార్థులకు మెలుకువలను వివరించారు. కార్యక్రమంలో ఎస్సై ప్రసాద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

లక్సెట్టిపేట: మానవ రవాణాను అరికట్టాలని అడిషనల్ డీఆర్డీవో వెంకటేశ్వర్లు అన్నారు. లక్సెట్టిపేట ఐకేపీ సంఘం భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మానవ అక్రమ రవాణా రోజురోజుకి పెరిగిపోతుందని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డీపీఎం వేణుగోపాల్, ఏపీఎం లక్ష్మి, సీసీలు లచ్చన్న, సురేందర్, వసంత, సుమలత, రాజమణి, సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మానవ అక్రమ రవాణాపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఐకేపీ ఏపీఎం లలితకుమారి పేర్కొన్నారు. ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలోని మీటింగ్ హాల్లో మంగళవారం మహిళాగ్రూపు సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రేమ, పెళ్లి సంబంధాలు, ఉద్యోగం, సినిమాల్లో అవకాశాలు, తదితర విషయాలపై ఆశలు చూపి అక్రమ రవాణాకు తెగబడుతున్నారన్నారు. అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సమావేశంలో ఐకేపీ ఈసీలు సునీత, చారి, మోహన్, వీవోఏలు, మండలంలోని గ్రూపుల అధ్యక్షులు పాల్గొన్నారు.

భూ వివాదం పరిష్కరించిన అధికారులు

తాండూర్: ప్రజావాణిలో అందజేసిన ఫిర్యాదుకు స్పందించిన మండల ప్రభుత్వ శాఖల అధికారులు ఓ భూ వివాదాన్ని మంగళవారం పరిష్కరించారు. ఏళ్ల తరబడి నుంచి అపరిష్కృతంగా ఉన్న సమస్యకు సామరస్యపూర్వకంగా పరిష్కారాన్ని చూపారు. తాండూర్ మండలం అచ్చులాపూర్ గ్రామపంచాయతీలోని కొమ్ముగూడెం గ్రామ శివారు సర్వే నంబర్ 542లో ఉన్న గుంటస్థలాన్ని దుర్గం చిన్నమ్మ కుటుంబం అటవీ శాఖకు అప్పగించారు. ఆ స్థలం పక్కన ఉన్న మరికొంత స్థలంపై గ్రామస్తులు, చిన్నమ్మ కుటుంబం మధ్య తగాదా నడుస్తోంది. భూ తగాదా పరిష్కారం కోసం గ్రామానికి వెళ్లిన గిర్దావరు, సర్వేయర్లు భూ కొలతలు నిర్వహించి వివాదాస్పదంగా మారిన భూమి దుర్గం చిన్నమ్మది కాదని నిర్ధారించారు. వెంటనే మండలానికి చెందిన ప్రభుత్వ శాఖల అధికారులకు నివేదిక అందజేశారు. స్పందించిన అధికారుల బృందం దుర్గం చిన్నమ్మను తహసీల్ కార్యాలయానికి పిలిపించి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, సీఐ కుమారస్వామి, ఎస్సై కిరణ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎజాజుద్దీన్ పాల్గొన్నారు.

డిగ్రీ సహాయ ఆచార్య గోపాలకృష్ణకు డాక్టరేట్

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర సహాయ ఆచార్యుడిగా పనిచేస్తున్న రావికంటి గోపాలకృష్ణకు కాకతీయ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగంలో డాక్టరేట్ ప్రకటించింది. రిటైర్డు ప్రొఫెసర్ ఎస్.రాధాకృష్ణ పర్యవేక్షణలో తెలంగాణ రాష్ట్రంలో గిరిజన కుటుంబాల వ్యవసాయ పద్ధతుల మీద పరిశోధన కొనసాగించారు. డాక్టరేట్ పొందిన గోపాలకృష్ణను కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి, అధ్యాపకులు అభినందించారు.

మోడల్‌స్కూల్ ప్రవేశాలకు 20వ తేదీ తుదిగడువు

మంచిర్యాలఅర్బన్: మోడల్‌స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవటానికి ఈ నెల 20వ తేదీ తుదిగడువు ఉందని రాజీవ్‌నగర్ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ బుచ్చన్న తెలిపారు. ఆరో తరగతిలో 100సీట్లు మాత్రమే ఉన్నాయని, ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు.

నియామకం

బెల్లంపల్లి: తెలంగాణ ఎరుకల ప్రజా సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బెల్లంపల్లికి చెందిన ఉండ్రాల రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన సంఘం సాధారణ కార్యవర్గ సమావేశంలో రవి ఎంపికను రాష్ట్ర అధ్యక్షుడు కెమసారం తిరుపతి, జిల్లా అధ్యక్షుడు ఉండ్రాల ఎల్లయ్య ప్రకటించారు.

సంక్షిప్త వార్తలు

యువత సన్మార్గంలో నడవాలి

చెన్నూర్‌రూరల్: యువత దురలవాట్లకు అలవాటు పడకుండా సన్మార్గంలో నడుచుకోవాలని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవి.పట్వర్ధన్ అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రతిజ్ఞ చేయించారు.

పోచమ్మ తల్లి ఆలయానికి విరాళం

జన్నారం: మండలంలోని కొత్తూరుపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి ఆలయానికి మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ తనవంతుగా మంగళవారం రూ.20వేల విరాళం ఆలయ కమిటీ సమితి సభ్యులకు అందజేశారు.

విరిగిన స్తంభం.. విద్యుత్‌కు అంతరాయం

భీమిని: మండలంలోని జగ్గయ్యపేట వడాలకు వేస్తున్న బీటీ రోడ్డు పనుల్లో మంగళవారం జేసీబీ డ్రైవర్ నిర్లక్ష్యంతో విద్యుత్ స్తంభం విరిగింది. వెంటనే ఆ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. సమీప గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

కాసిపేట: బెల్లంపల్లికి చెందిన పులి సౌజన్య ఫోన్ పోగొట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫిర్యాదు చేసింది. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ గుర్తించి మంగళవారం బాధిత మహిళకు అప్పగించినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

రూ.32వేలకు వారసంత వేలం

తాండూర్: మండలంలోని రేచినీ గ్రామపంచాయతీలో నిర్వహించే వారసంతకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. శుక్రవారం రోజున నిర్వహించే వారసంతను మండలంలోని తంగళ్లపల్లి గ్రామానికి చెందిన మోమిన్ అలీ అనే వ్యక్తి పోటీపడి రూ.32వేలకు దక్కించుకున్నాడు.

పంట మార్పిడిపై రైతులకు అవగాహన

తాండూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని రైతువేదికలో మంగళవారం రైతులకు పంట మార్పిడిపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి కె.సుష్మ పాల్గొని పంటల సాగు విధానాలను, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు యు.శంకర్, వి.వి.ధనలక్ష్మి, ఎం.వెంకటేష్ , రైతులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

బెల్లంపల్లి: మండలంలోని పెర్కపల్లి గ్రామానికి చెందిన కుదిరే సరిత మెదడు వాపు వ్యాధితో బాధపడుతోంది. వైద్యం చేయించుకోవడానికి బెల్లంపల్లి జనహిత సేవా సమితి నిర్వాహకులు సేకరించిన రూ.27వేలు మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి


వినతిపత్రం ఇస్తున్న వైద్య సిబ్బంది

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డిస్పెన్సరీలో వైద్య ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. ఆ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్‌రావులు మంగళవారం డిస్పెన్సరీని సందర్శించి ఉద్యోగుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు వారి సమస్యలను వినతిపత్రం ద్వారా తెలియజేశారు. డిస్పెన్సరీలో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. వృత్తిపరమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం ఏఐటీయూసీ నేతలు మాట్లాడుతూ.. ఉద్యోగుల పేర్కొన్న సమస్యలను ఏరియా స్థాయి స్ట్రక్చరల్ సమావేశంలో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ఫిట్ కార్యదర్శి విజయలక్ష్మి, నాయకులు రాజ్‌కుమార్, గణేష్, ప్రణయ్, లింగమూర్తి పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ చీటీలివ్వాలి


వినతిపత్రం ఇస్తున్న బీఎంఎస్ నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ (సీఎంపీఎఫ్) చీటీలను వెంటనే అందజేయాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ఆ శాఖ అధికారులను కోరారు. సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ నాయకులతో కలిసి మంగళవారం ఆయన గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ శాఖ కమిషనర్ శ్రీహరి పచౌలీని కలిసి వినతిపత్రం సమర్పించారు. కాంట్రాక్టు కార్మికులకు ఇప్పటివరకు సీఎంపీఎఫ్ ఖాతాలో ఎంత నిధి జమ అయ్యిందో తెలియడం లేదన్నారు. వెంటనే వివరాలను అందించాలన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు మిట్టపల్లి మొగిలి, కలవేన శ్యామ్, నస్పూర్ బాపు, సురేష్, సత్యనారాయణ, రాజగోపాల్, సమ్మయ్య పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

నియామక పత్రాలు పంపిణీ


నియామకపత్రాలు అందుకున్న వారితో జీఎం

మందమర్రిరూరల్: ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 40మంది డిపెండెంట్లకు జీఎం దేవేందర్ ఉద్యోగ నియామకపత్రాలు అందించారు. విధులకు సక్రమంగా హాజరై బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు సహకరించాలని జీఎం కోరారు.

కాసిపేట గని సందర్శన

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 1గనిని మంగళవారం కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు సందర్శించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టి గనికి వచ్చిన ఏజెంటును గని మెనేజర్ భూశంకరయ్య, అధికారులు, కార్మిక సంఘాల నాయకులు సన్మానించి జ్ఞాపికగా పూలమొక్క అందించారు. కార్యక్రమంలో రక్షణాధికారి నిఖిల్ అయ్యర్, ఫిట్ ఇంజనీర్ మధుకర్, డెప్యూటీ మెనేజర్ వెంకటేష్, సంక్షేమాధికారి మీర్జా గౌస్ జీశాన్, బన్న లక్ష్మణ్‌దాస్, ఏఐటీయూసీ నాయకులు దాగం మల్లేష్, మినుగు లక్ష్మీనారాయణ, అధికారులు తదితరులున్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల ధ్రువపత్రాలు అందజేత

మందమర్రిరూరల్: పట్టణంలోని పాలచెట్టు ఏరియా సమీపంలో ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల ధ్రువపత్రాలను మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. తహసీల్దార్ సతీష్‌కుమార్‌తో పాటు ఆఫీస్ సిబ్బంది డబుల్ బెడ్‌రూం ఇళ్లను సందర్శించి మాట్లాడారు. ఇల్లుకు సంబంధించిన ధ్రువపత్రాలు అందుకున్న వారు శుభ్రం చేసుకొని ఉండాలని సూచించారు. ప్రభుత్వం అందించిన ధ్రువపత్రంతో పాటు వారి ఆధార్ కార్డు, ఒక ఫొటో తీసుకొని విద్యుత్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు 243మంది లబ్ధిదారులకు లక్కీ డ్రా ద్వారా ఇల్లు కేటాయించామని, 15మంది లబ్ధిదారులపై అభ్యంతరాలు వచ్చాయని తెలిపారు. వచ్చిన అభ్యంతరాలను విచారించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ గణపతి, పద్మజా, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

వసతి గృహ సంక్షేమ అధికారి ఉద్యోగానికి ఎంపిక


యాసం శ్రీనివాస్

భీమారం: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన యాసం రాజమల్లు, జక్కమ్మల కుమారుడు యాసం శ్రీనివాస్ సోమవారం ప్రకటించిన తెలంగాణ వసతి గృహ సంక్షేమ అధికారుల ఉద్యోగ ఫలితాల్లో సంక్షేమ అధికారిగా ఎంపికయ్యాడు. రాష్ట్ర స్థాయిలో 130ర్యాంకుతో ఓపెన్ క్యాటగిరీలో ఉద్యోగం సాధించాడు.

'రైతునేస్తం' సద్వినియోగం చేసుకోవాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో డీఏవో కల్పన

జన్నారం: రైతునేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు సూచనలు, సలహాలు అందజేయనున్నట్లు ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎ.కల్పన అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో రైతులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఏవో, ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ హరికాంత్, (అగ్రోనమి) సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్. సయ్యద్ అహ్మద్ హుస్సేన్ మామిడి తోటలో యాజమాన్య పద్ధతుల గురించి, వేసవిలో దుక్కి దున్నడం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, మండల వ్యవసాయ అధికారి పి. సంగీత, వ్యవసాయ విస్తరణ అధికారులు త్రిసంధ్య, దివ్య, సాయి, లవన్, అక్రమ్ రైతులు పాల్గొన్నారు.

మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి


మిర్చి పంటను పరిశీలిస్తున్న సంఘం నాయకులు

చెన్నూర్: రైతు పండించిన అన్ని పంటలకు మద్దతు ధర చెల్లించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు బి.కాంతయ్య అన్నారు. స్థానిక గోదావరి రోడ్డులో ధర లేక కల్లాలపై ఉన్న మిర్చి పంటలను మంగళవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పండించిన మిర్చి పంటకు ధర లేక రైతులు నష్టాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది క్వింటాళ్ మిర్చి ధర రూ.25వేలు పలికిందన్నారు. ఈ ఏడాది సగానికి పడిపోవడం దారుణమన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం క్వింటాళ్ మిర్చి ధర రూ.25వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు బి.గోపినాథ్, రైతులు అశోక్, దినేష్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

ప్రమాదకరంగా కల్వర్టు..!



జన్నారం: మండలంలోని కలమడుగు గ్రామంలో కల్వర్టు సగం వరకు కూలిపోయి ప్రమాదకరంగా ఉంది. 20రోజులుగా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా, డ్రెయినేజీలో పడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన నంబర్ : వినోద్, పంచాయతీ కార్యదర్శి   ఫోన్ నంబర్ : 86867 06032

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల : 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
చెన్నూర్ : సంపత్‌కుమార్ - 9949708989
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899